# ఆ రాత్రి...!

తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి

శృంగార వీధి

రాత్రి...

తొమ్మిదిన్నర గంటలు...

ఇంట్లో ఎవ్వరూ లేరు. ఆమె ఒక్కతే పడగ్గదిలో పడుకుని వుంది. నిద్ర రావటం లేదు కాబోలు, పక్కమీద అటూ ఇటూ దొర్లుతోంది.

ఆమె చీర కట్టుకుందన్న మాటేకానీ, అది అస్తవ్యస్తమై శరీరాన్ని ముప్పాతిక భాగం బహిర్గతపరుస్తోంది.

వెర్రెక్కిస్తోన్న విరహతాపం నిలువెత్తున కవాతు చేస్తూ రసభావాల్ని ఊరిస్తుంటే ,ఓపలేని తనువు కాంక్షల కీలల్లో వెచ్చగా కాలుతూందేమో బహుశా!

కనురెప్పల్ని మత్తుగా మూసి వున్నట్టుండి దిండుని గట్టిగా కావలించుకుంది. అంతలోనే టెలిఫోన్ మోగింది.

ఆమె అలాగే పడుకుని, నెమ్మదిగా చేయి చాచి, మంచం పక్కనే వున్న టీపాయ్‌మీది కార్డ్ లెస్‌ని అందుకుని, బటన్ నొక్కి "హలో!" అని లోగొంతుకతో అంది.

అవతల్నుంచి ఏదో అన్నారు.

ఆమె కిసుక్కున నవ్వింది. నవ్వి "ఒక్కతికే నిద్ర రావటం లేదు" చెప్పింది.

"...."

"విరహం తీయగా వుంది."

"...."

"వస్తున్నావా?"

"...."

"ఈ రాత్రి వేళ?"

"...."

"వచ్చేప్పుడు జాగ్రత్త!"

"...."

"నీకన్నీ తెల్సులే కాని, నే చెప్పాల్సింది చెప్తున్నాను, అంతే!"

"...."

"ఢిల్లీ వెళ్లావా? చెప్పలేదేం?"

"...."

"అంటే కోపం ఇప్పుడు పోయిందా?"

"...."

"సర్లే! మరి నాకోసం ఏం తీసుకొచ్చావ్?"

"...."

"డ్రెస్సా? ఏ రంగు?"

"...."

"పసుపు రంగంటే నాకిష్టం."

"...."

"నాకిష్టం అని తెల్సే తీసుకొచ్చావ్ సరే, మరి నీకోసం ఏం తెచ్చుకున్నావ?"

"...."

"ఎందుకు తెచ్చుకోలేదు?"

"...."

"అదేం కుదర్దు. ఇక్కడైనా కొనుక్కో."

"...."

"పరుగెత్తుకు రావాలనిపిస్తోందా? నా తండ్రే!"

"...."

"ఇక నువ్వొస్తే ఈ రాత్రంతా నిద్ర పోనీవు!"

"...."

"నీ సంగతి నాకేం కొత్తా? రాత్రి సాంతం జాగారం చేయిస్తావ్‌గా...!"

"...."

"ఇలా మాట్లాడుతూవుంటే ఇక తెల్లారిపోతుంది. త్వరగా వచ్చేయ్!"

"...."

"పసుపు రంగు చీరలో వున్నాను."

"...."

"ఛీ! అవన్నీ నీకెందుకు?"

"...."

"అడగరాదు!"

"...."

"అదంతే!"

"...."

"ఛీ! ఇబ్బంది పెట్టొద్దు!"

"...."

"సర్లే! వచ్చాక చూస్తావుగా!"

"...."

"ఇప్పటికే పది గంటలు కావొస్తూంది."

"...."

" నేనంటే అంత ఇష్టమైనప్పుడు త్వరగా వచ్చేయొచ్చుగా?"

"...."

"నాక్కూడా నువ్వంటే ఇష్టమే! నో.. నో...! ఇష్టం కాదు, ప్రాణం! కాని అలకలు కూడా అందమే కదా!"

"...."

"ఆ తేడా ఏంటో నువ్వే తెల్సుకోవాలి."

"...."

"అబ్బా! విసిగించకు!"

"...."

"నువ్విలాగే విసిగిస్తే ఫోన్ పెట్టేస్తాను."

"...."

"నేనింకేం మాట్లాడను!"అంటూ కార్డ్ లెస్ స్విచ్ ఆఫ్ చేసి, దాన్ని టీపాయ్ మీద పెట్టేసి తనలో తనే ముసిముసిగా నవ్వుకుంటూ... అలవోకగా తనవైపోసారి చూసుకుని, సిగ్గుతో చప్పున ముడుచుకుపోయింది ఆమె.

క్షణాలు నిశ్శబ్దంగా దొర్లుతున్నాయి. ఉన్నట్టుండి ఆవులిస్తూ ఆమె ఓ మారు ఒళ్లు విరుచుకుంది.

ఆ భంగిమ...

వంగిన మన్మథుడి విల్లులా...

రతీదేవిని మించిన శృంగారదేవతలా...

నిజం!

ఆమెకు తెలుసో, తెలీదో కానీ, ఎనిమిది ఆకారంలో వున్న ఆమె శరీరం సెక్స్‌ను గుప్పిస్తోంది. ఆకారానికి తోడుగా ముచ్చటైన అందం. ఆ అందం కోసం ఇంకాసేపట్లో రాబోతున్న అభినవమన్మథుడు! ఇక అంతకన్నా కావలసిందేముంది?

"ఈ రాతిరి శివరాతిరి జాగారమే చేయరాదా...!" ఉన్నట్లుండి సందర్భానికి తగినట్లుగా పాటందుకుని చిటికెలేస్తూ వెళ్లి పడగ్గది తలుపులు తీసి, బయటి గదిలో లైట్ వేసి, ఆ గది మధ్యగా వున్న సోఫాలో చేరగిలబడి కూర్చుంది.

క్షణాలు...

నిముషాలు...

దాదాపు పది నిముషాలు గడిచిపోయాయి. ఆ మాత్రానికే ఆమెకు విసుగొచ్చినట్లుంది.

"ప్చ్!" పెదవులు చిట్లిస్తూ వాల్ క్లాక్ కేసి చూసింది.

"కిర్...!" అంతలోనే కాలింగ్ బజర్ మోగింది.

ఆమె పరుగున వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా సురేష్!

నీలి రంగు జీన్స్‌ప్యాంట్. నల్లని ఫుల్ షర్ట్.

అతన్ని చూడగానే అదో సిగ్గుగా.. అదో ప్రేమగా... నవ్వుతూ దారి తొలగింది.

"శ్రీవారు లేకుండా రెండు రాత్రులు వృథా చేశావ్!" లోపలికి వస్తూ అన్నాడు.

"మరేం చేయను?" తలుపు వేసి లాక్ చేస్తూ అంది.

"ఒక్కతివే ఎలా వుండగలిగావ్?" అడిగాడు.

"అలాగే... ఎలాగో..." అంటూ వెళ్లి లైట్ ఆఫ్ చేసింది.

అప్పటికి అతను బెడ్రూమ్‌లోకి వెళ్లాడు.

"వస్తూంటే భయమనిపించిందా?" ఆమె బెడ్రూమ్‌లోకి వెళ్లి తలుపులు దగ్గరగా వేస్తూ అడిగింది.

"భయమెందుకు?" అడిగాడు.

"పగలైతే సమస్య వుండదు..." అంటూ సురేష్‌కు దగ్గరగా వెళ్లి చెదిరిన అతని జుట్టును సరిచేసింది.

"అంత భయమైతే ఎలా?" ఆమె భుజాల చుట్టూ తన రెండు చేతుల్నీ వేసి పొదివిపట్టుకుంటూ అడిగాడు.

"అసలే రోజులు బాగాలేవు" అంది.

"సర్లేగాని, ఇక పడుకుందామా?" అడిగాడు.

"వద్దు!"

"మరేం చేద్దాం?" ఆమె ముఖంలోకి చూస్తూ కనుబొమలేగరేశాడు.

"కాస్సేపు కమ్మగా మాట్లాడుకుందాం."

"మాట్లాడి...?" అడుగుతూ ఆమెను అలాగే పట్టుకుని బెడ్ దగ్గరికి తీసుకెళ్లాడు.

"ఆ తర్వాత హాయిగా నిద్ర పోదాం" చెప్పింది.

ఆమెను అలాగే పట్టుకుని బెడ్ మీద వాలిపోతూ "నిద్రా? నో! నో! అదేం కుదర్దు!" అన్నాడు.

"మరి?"

"ఈ రాత్రి సాంతం మనం నిద్ర పోయేది లేదు!"

"నాకు నిద్రొస్తూంది!" ఆమె మారాం చేస్తూ అంది.

"అలాంటి దానివి నన్నెందుకు రమ్మన్నావ్?"

"నిన్ను చూడకుండా వుండలేను కాబట్టి!"

"నన్ను చూడకుండా వుండలేనప్పుడు నన్ను కాదనకుండా కూడా వుండగలగాలి!"

"సరే కాని..."

"కాని?"

"రాత్రి సాంతం అంటున్నావ్?"

"అవును" కళ్లు ఆర్పాడు.

"రేపు ఎవరైనా రాత్రి నిద్ర లేదా? కళ్లు ఎరుపెక్కాయేం? అని అడిగితే?" పసిపిల్లలా అంది.

"విరహానికి రెక్కలొచ్చాయని చెప్పు!" అంటూ ఆమెను అలాగే అల్లుకుపోయాడు.

అతని కౌగిట్లో ఆమెకిక మాటలు కరువయ్యాయి.

✣ ✣ ✣

రాత్రంతా నిద్రలేదు. తెల్లవారెప్పుడో మెలకువ వచ్చి చూసుకుంటే, తన చుట్టూ చేయి వేసి నిద్రపోతూ కనిపించాడు సురేష్.

మురిపంగా అతని తల నిమిరింది ఆమె.

తర్వాత...

మొగుడూ పెళ్లాల మధ్య గొడవలొచ్చి రోషంగా రెండ్రోజులు అటూ ఇటూగా వున్నా, ఆ తర్వాత అంతా మాసిపోయి మామూలైపోతుందన్నట్టుగా... రెండ్రోజుల కిందటి కోపాన్నంతా మరిచి హాయిగా పడుకుని వున్న సురేష్ వైపు తిరిగింది అలవోకగా.

అతడు మెలకువతోనే వున్నట్టున్నాడు.

"అలిగిన తర్వాత కలయిక ఇంత మధురంగా వుంటుందా?" ప్రేమగా అంటూ ఆమెను మరింత గట్టిగా కావలించుకున్నాడు.

ఆమె సిగ్గుల మొగ్గవుతూ భర్త పరిష్వంగంలో ఒదిగిపోయింది! ■

